"ఏరా తమ్ముడూ మన పందెం గుర్తుందా? ఏదీ మీ ఆపిణ్ణిలా పిలు'' అక్కగారి మాటలకి సుబ్బారావు గుండెల రాయి పడింది.

# పందెం



సుబ్బలక్ష్మిని పెళ్ళి చూపులు చూసు కుందుకు సుబ్బారావు, వాళ్ళక్క వెళ్ళారు. పిల్ల నచ్చింది. ఆ రాత్రి "ఒరేయ్ ఆ అమ్మాయిది యెంత పొడుగు జడో చూశావా" అంది సుబ్బారావు అక్క.

"ఆ అదంతా జడేనేమిటి కొంత సవరం అయి వుంటుంది" అన్నాడు.

"మంచివాడవే సవరం యేమీకాదు అదంతా జడే"

"అబ్బే కొంత సవరం" అన్నాడు సుబ్బారావు.

"అయితే పందెం."

"ఆ పందెం."

"ఎంతెంత."

"వంద రూపాయలు" యిద్దరూ ఒప్పు కొన్నారు.

కొన్నాళ్ళకి పెళ్ళయింది. మనుగుడు పులు అయ్యాయి. అమ్మాయిని అత్తవా రింటికి తీసుకొచ్చారు హఠాత్తుగా పందెం గుర్తొచ్చింది సుబ్బారావు అక్కకి.

సుబ్బారావుకి భయంగా ఉంది. అప్పు డేదో తేలిగ్గా పందెం కాశాడుకాని ఒకవేళ అంతా జడే అయితే యిప్పుడు వంద రూపాయలు ఎక్కడినుంచి తెస్తాడు యింకా ఆఫీసులో స్టాఫ్‌కి పార్టీ యివ్వాలి కూడాను కానీ తప్పదు. అక్క ఊరు కోదు.

పిలిపించారు. సుబ్బలక్ష్మి వచ్చింది సిగ్గుపడుతూ. విషయం వివరించారు.

సుబ్బలక్ష్మి నవ్వుతూ తన జడ ముందు వేసుకొని ఒక్కొక్క పాయే విప్పటం మొదలుపెట్టింది.

అక్కా, తమ్ముళ్ళ యిద్దరి గుండెలూ వేగంగా కొట్టుకొంటున్నాయి. ఎవరు నెగ్గు తారో అని.

సుబ్బలక్ష్మి సగం జడ విప్పేసరికి సవరం చేతిలోకి వచ్చింది. సుబ్బారావు

## మినీ కథావీధి

ముఖం రూపాయికాసంత వాళ్ళక్క ముఖం నయాపైసంతా అయ్యాయి సుబ్బారావు ప్రేమగా భార్యవైపు చూశాడు. సుబ్బ లక్ష్మి ముసి ముసి నవ్వులు నవ్వింది.

నేనే యెందుకు గుర్తు చేశానురా దేముడా అనుకొంటూ ఆవిడ వంద రూపా యల నోటు తెచ్చి సుబ్బారావు చేతిలో పెట్టింది.

*　　*　　*

సాయంత్రం సుబ్బారావు మేడమీద కూర్చుని ఆలోచించుకొంటున్నాడు. ఆ వంద రూపాయలతో ఏం కొనుక్కుందామా అని యెన్నో వూహించుకొంటు న్నాడు.

ఇంతలో గాజుల గలగల విని ప్రక్కకి తిరిగి చూశాడు. సుబ్బలక్ష్మినుంచునుంది

—కొచ్చెర్లకోట శాంతి

"రా. యేమిటి యిలావచ్చావుయేమన్నా పనుందా" అడిగాడు సుబ్బారావు.

'మీ అక్కగారిచ్చిన వందరూపాయలూ ఏవీ. న్యాయంగా అవి నాకు చెందుతాయి'

"అదేమిటి. మేమిద్దరం పందెం వేసు కొన్నాం. నేను నెగ్గాను నీకు చెందటం ఏమిటి" అయోమయంగా అడిగాడు సుబ్బారావు.

"మీరు పందెం వేసుకున్నది ఎప్పుడు? మన పెళ్ళి చూపులలో. అప్పటికి అదంతా నా జడే. నాకు ఎంత కాలానికీ పెళ్ళి కుదర టం లేదనీ కుదిరితే తిరపతిలో సగం జుట్టు యిప్పిస్తానని మా అమ్మ మొక్కుకుంది. పెళ్ళి కుదరగానే యిచ్చేశాను పొడుగుజడ అల వాటు కొద్దీ సవరం పెట్టాను అసలు విషయం మీ అక్కగారికి చెప్పకుండా ఆవిడ దగ్గర నుంచి డబ్బు రప్పించాను. అందువల్ల ఆ డబ్బు నాది. ఇప్పుడు నేను మీ వదినా, బజారుకెడుతున్నాం. ఆ వందా పెట్టి నేనొక చీర తీసుకొంటాను" అతని జవాబు కెదురు చూడకుండా నవ్వుతుంటూ అతని జేబులోని నోటు తీసికొని క్రిందకు పరిగెట్టింది సుబ్బలక్ష్మి.

సుబ్బారావుకి నోట మాట రాలేదు. ●

## మిమిక్రీ మిత్రులు



శ్రీ కస్తూరి

పేరు— కస్తూరి అనంత పద్మనాభ రావు. వీరి జన్మస్థలం రామచంద్ర పురం మిమిక్రీ కళ ద్వారా తూర్పు, పశ్చిమ గోదావరి ప్రాంతాలలో మంచి పేరు సంపాదించారు. సుమారు 260 ప్రోగ్రాములదాకా ఇచ్చారు నాటకకళలో కూడాఅనుభవం వుంది. హాస్య పాత్రలువేసి వుత్తమ హాస్యనటుడిగా జిల్లా స్థాయిలో పరి షత్తులలో బహుమతులు పొందారు. వీరు ముఖ్యంగా గాయకులను గాయనీమణులను అనుకరించడంలో సిద్ధహస్తులు. వీరు వెంట్రిలాక్విజం కూడా అభ్యసించారు. లిప్ మూవ్ మెంట్ లేకుండా పాట పాడడం. Talking doll ప్రదర్శన వీరి ప్రత్యేక అంశాలు. వీరీ కళను వృత్తిగా స్వీకరించాలని అభిప్రాయ పడుతున్నారు.

పరిచయకర్త :

— నేరెళ్ళ లక్ష్మణరావు